24042025-MAI-08_Layout 1 4/24/2025 2:14 AM Page 1



'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి. చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారా హిల్స్, హైదరాబాద్-500034. e-mail: editpage@ntnews.com

**నమస్తే తెలంగాణ**

## కశ్మీర్ లోయలో ఉగ్ర ఘాతుకం

**ప్రశాంతత** నెలకొంటున్నట్టు అందరూ భావిస్తున్న కశ్మీర్ లోయలో మరోసారి ఉగ్రవాదం పంజా విసరడం దిగ్భ్రమ కలిగిస్తున్నది. మతోన్మాద కర్కశ నరమేధానికి పాతికమందికి పైగా అమాయక పౌరులు బలికావడం ప్రతి ఒక్కరినీ కలచి వేస్తున్నది. ప్రకృతి రమణీయతతో అలరారే కశ్మీర్ ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా పేరెన్నిక గన్నది. అలాంటి చోట పర్యాటకులే లక్ష్యంగా ఉగ్రవాదం విరుచుకుపడటంతో దేశం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. అందులోనూ మృతుల్లో హనీమూన్‌కు వచ్చిన పర్యాటకులు ఉండటం అత్యంత బాధాకరం. కొత్త పెండ్లి కొడుకు శవం పక్కన నవవధువు రోదిస్తున్న దృశ్యం ఉగ్ర ఘాతుకం అనాగరిక, అమానవీయ, అర్థరహిత దిగజారుడు తనానికి అద్దంపట్టింది. ఉగ్రవాదులు ఒక వర్గంవారిని లక్ష్యంగా చేసుకున్నట్టు కనిపిస్తున్నప్పటికీ ఇతర వర్గాల వారూ మృతుల్లో ఉండటం గమనార్హం. పర్యాటకులను చంపడం పిరికిపందల చర్య తప్ప మరోటి కాదు. దీనిద్వారా ఉగ్రవాదులు ఏం సాధించాలనుకుంటున్నారో అర్థం కావడం లేదు. ఏ రకమైన విలువలూ ఈ క్రౌర్యాన్ని సమర్థించలేవు. ఇది లష్కరే తోయిబా అనే పాక్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థ నుంచి పుట్టుకువచ్చినది రెసిస్టెంట్ ఫ్రంట్ పనే అంటున్నారు. బాధ్యులెవరైనా ఈ నిరర్థక మారణహోమానికి మూల్యం చెల్లించుకోక తప్పదు.

370 అధికరణం రద్దు, రాష్ట్ర విభజన, కొంచెం ఆలస్యంగానైనా ఎన్నికల నిర్వహణ అనే కీలక ఘటనల క్రమం తర్వాత కశ్మీర్ మెల్ల మెల్లగా కుదుటపడుతున్నదనే భావన ప్రజల్లో కలుగుతున్నది. దాని ఫలితంగా కశ్మీర్ సందర్శించే పర్యాటకులూ పెరుగుతున్నారు. ఎత్తయిన రైలు వంతెన, పొడవైన సొరంగాలు వంటి హంగులూ అదనపు ఆకర్షణగా నిలుస్తున్నాయి. కానీ ఇప్పుడు భరోసా పోయి భయం వచ్చిచేరింది. భయం నీడలో విహార యాత్రలు సాగడం అసాధ్యమే. కశ్మీర్ ప్రధాన ఆదాయవనరుగా ఉండే పర్యాటకం మరోసారి పెను ప్రమాదంలో చిక్కుకుంది. దాల్ సరస్సులో షికారాలను ఒడ్డున కట్టిపడేసే పరిస్థితి దాపురించింది. సరిహద్దులు దాటివస్తున్న ఉగ్రవాదంతో ఏమాత్రం సంబంధం లేని సామాన్య కశ్మీరీ ప్రజలు బలిపశువులు కావడం విచారకరం.

మంగళవారం నాటి మారణహోమం పుల్వామా తర్వాత జరిగిన అతిపెద్ద ఉగ్రదాడి. అప్పటిలాగే ఇప్పుడు కూడా నిఘా వ్యవస్థల వైఫల్యం తీవ్ర విమర్శలకు గురవుతున్నది. మినీ స్విట్జర్లాండ్‌గా పిలిచే బైసరాన్ అనే మారుమూల ప్రాంతంలో ఉగ్రదాడి జరిగింది. అక్కడికి కాలిబాటన లేదా గుర్రాలపై మాత్రమే వెళ్లడం సాధ్యం. అలాంటి చోట తగిన భద్రత కల్పించడంలో యంత్రాంగం వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వంతో పాటుగా కేంద్ర ప్రభుత్వమూ బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఒకరకంగా చెప్పాలంటే కేంద్రం బాధ్యతే ఎక్కువ. ఎందుకంటే కశ్మీర్ ఇంకా కేంద్రపాలిత ప్రాంతంగానే ఉంది. అక్కడ అణువణువూ కేంద్ర బలగాల ఆధీనంలోనే ఉంటుంది. కశ్మీర్ లో సుదూర పర్యవసానాలకు దారితీసే మార్పులు తెచ్చింది కూడా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమే అనేది మరిచిపోరాదు.

# యువ తెలంగాణ @25 ఏండ్ల బీఆర్‌ఎస్

'మా ఒంటిపై పడే ఒక్కో దెబ్బకు కాంగ్రెస్ లక్ష ఓట్ల మూల్యం చెల్లించుకోక తప్పదు' అంటూ ఉగాది పండుగ రోజు రేవంత్ సర్కార్ వడ్డించిన అరాచకాన్ని చొక్కాలు విప్పి చూపెడుతూనే హెచ్‌సీయూ విద్యార్థి ఒకరు సూటిగా హెచ్చరించిన ఉదంతం బహుశా అందరి మదిలో మెదలుతూనే ఉండి ఉంటుంది. ఆ లెక్కన కాంగ్రెస్ సర్కార్ వెన్నుపోటుకు తల్లడిల్లుతున్న నవతరం కన్నెర్రను మొత్తం లెక్కిస్తే హస్తం పార్టీ ఎంత విశ్వాసాన్ని పారేసుకున్నదో అంచనాకు కూడా రాలేం. సరిగ్గా ఏడాదిన్నర ముందు అదే క్యాంపస్ గేటు ముందు రాహుల్‌గాంధీ, అక్కడి నుంచి గంటన్నరలో చేరుకొనే సరూర్‌నగర్ స్టేడియంలో ఆయన సోదరీమణి ప్రియాంక గాంధీ రాష్ట్ర యువ లోకానికి చేసిన బాసలన్నీ నీటి బుడగల్లా పేలిపోతుంటే యావత్తు నవతరం తల్లడిల్లిపోతున్నారు.



**డాక్టర్ ఆంజనేయ గౌడ్**



హైదరాబాద్ విశ్వవిద్యాలయ భూముల్లో నేలరాలింది చెట్లు, నెమళ్ళు, జింకలు మాత్రమే కాదు, తెలంగాణ యువతరం ఆశలు, ఆకాంక్షలు కూడా. యూపీలో అమలవుతున్న బుల్డోజర్ భీభత్సం ఇంత త్వరగా తెలంగాణ అనుభవంలోకి కాంగ్రెస్ సర్కార్ తీసుకువస్తుందని ఎవరైనా కలలో కూడా ఊహించరు కదా?. అందులోనూ వర్శిటీల పైకి బుల్డోజర్‌ల కవాతును తిలకించే పరిస్థితి వస్తుందని ఏ ఆలోచనపరులు మాత్రం అంచనా వేయగలరు?. అయితే ఇందిరా కాంగ్రెస్ హిస్టరీ చదివిన వారికి ఈ ఉత్పాతాలు, హస్తం సర్కార్‌ల వికృత విన్యాసాలు స్పష్టంగానే తెలుసు. అందుకే అనేక సాంప్రదాయిక కాంగ్రెస్ ఓటు బ్యాంకు వర్గాలు బ్యాలెట్ పేపర్ ఓటింగ్ నాటికే హస్తం గుర్తుపై వేలేయడం మానుకున్నాయి. కానీ, సమస్యంతా అనుభవంలో చూడక, చరిత్రనూ చదవక, వాట్సాప్ వలలో, యూట్యూబ్ గోలలో గందరగోళం ఏరుకునే కొంతమంది కొత్త తరంతోనే వచ్చిపడింది. దాని వల్లనే ఈవీఎంల ముందు యువత విచక్షణను వదిలేస్తున్నారు. ఫలితంగా రేవంత్ రెడ్డి సర్కార్ లాంటి దివాళాకోరు ప్రభుత్వాలు ప్రజల తలపై కెక్కగలుగుతున్నాయి. ఎంత విచిత్రమంటే సునీల్ కనుగోలు కనికట్టో, ప్రశాంత్ కిషోర్ కిటుకుల పెట్టో ప్రభావశీలురైన నవలోకాన్ని వలలో బంధించగలుగుతుండటం ఆవేదన కలిగించే పరిణామం కాదా?. అయితే అబద్ధాలకు ఆయుష్షు తక్కువన్నట్లు, రేవంత్ సర్కార్ డైలాగ్‌ల సంగతి కూడా డామిట్ కథ అడ్డం తిరిగిన చందంగా మారింది.

కుక్క తోలు కప్పుకున్నా, నక్క తన నైజాన్ని ఎలా దాచిపెట్టుకోలేదో, మేక వన్నె పులి డీఎన్‌ఏ కలిగిన కాంగ్రెస్ కూడా నమ్మిన వర్గాలను బలి తీసుకోకుండా ఆగలేదు. ఆ కోవలోనే కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి బోధి వృక్షాల్లా పెంచి, ఇంటింటికీ కల్పవృక్షాలుగా మారాలనే సదుద్దేశంతో ఏర్పాటుచేసిన గురుకుల విద్యావ్యవస్థను ఏడాదిన్నరలోపే బలిపీఠం ఎక్కించారు. విషాహారం, పాముకాట్లు, ఆత్మహత్యలు, అంటువ్యాధుల వలలో విలవిలలాడుతూ రాలిపోతున్న చిన్నారులను చూసి సమాజం గుండె తరుక్కుపోతున్నది. ఎవరెస్టు శిఖరాన్ని ఎక్కిన ఆణిముత్యాల ఆత్మవిశ్వాసాన్ని ఏడాదిన్నరలోనే అంధకారపు అగాథంలోకి హస్తం సర్కార్ నెట్టగలిగింది. దానివల్లనే అడ్మిషన్ల కోసం కార్యాలయాల ముందు తొక్కిసలాట జరిగిన పరిస్థితి నుంచి గురుకులాల్లో సీట్లు అడిగేవారే కరువయ్యారు. అంతేకాదు చిన్న గీతల ముందు పెద్ద గీతనొకదాన్ని గీసి చెరిపేయకుండానే వాటిని కనుమరుగు చేసే కుయుక్తులతో ఇంటిగ్రేటెడ్ యంగ్ ఇండియా స్కూళ్లరాగమెత్తుకున్నారు. ఉట్టికెగరలేనోడు ఆకాశాన్ని అందుకుంటానని ప్రగల్భాలు పలికినట్టున్నది రేవంత్‌రెడ్డి ప్రభుత్వ వైఖరి. పోనీ, ప్రభుత్వ బడులేమైన హస్తం పార్టీ ప్రభుత్వ పెద్దల ఆదరణకు నోచుకుంటున్నాయా అంటే అదీ లేదు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం 'మన ఊరు-మన బడి' పథకం ద్వారా అభివృద్ధి చేసిన వంటగదులు, క్లాస్‌రూంలు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు తప్ప మరే ముందడుగూ లేదు. కేసీఆర్ ప్రభుత్వం పాఠశాలల్లో లక్షల ఖరీదైన డిజిటల్ బోర్డ్‌లను సైతం ఏర్పాటుచేసి విద్యారంగంలో ఆధునిక సాంకేతిక సదుపాయాలు కల్పించింది. మరి ఏడాదిన్నర ఏలుబడిలో ఇందిరమ్మ సర్కార్ చక్కబెట్టిందేమిటని ఆరా తీస్తే తెల్లమొహమేసుకోవడం తప్ప తేలేదేం లేదు. పాఠశాల విద్యావ్యవస్థలోనే కాదు కళాశాల, వర్శిటీ స్థాయిల్లోనూ అడిగేవాడు లేక, ఆసరాగా నిలిచే సర్కార్ కానరాక అవస్థల వ్యవస్థలుగా దిగజార్చబడ్డాయి. పైగా ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థుల నిరసనలపై ఉక్కుపాదం మోపి ఇందిరమ్మ రాజ్యాన్ని రేవంత్ రెడ్డి ప్రభుత్వం రుచి చూపెట్టింది.

> **గత కేసీఆర్ ప్రభుత్వం పునాది నుంచి విద్యారంగంలో మౌలికమైన మార్పులు తెచ్చి, నూతన గురుకులాల నుంచి మెడికల్ కళాశాలల వరకు అవసరమైన విద్యా సదుపాయాలన్నింటినీ 33 జిల్లాలకు అందుబాటులోకి తెచ్చి పేద, మధ్యతరగతి కుటుంబాలకు విద్యా అవకాశాలను అందుబాటులో ఉంచింది. కానీ, నేటి రేవంత్ సర్కార్ మాత్రం చదువుకు చెదలా మారి స్కిల్ యూనివర్సిటీ, ఇంటిగ్రేటెడ్ స్కూల్ కథలతో కాలక్షేపం చేస్తుండటం విద్యావేత్తలందరిలో ఆవేదన కలిగిస్తున్నది.**

దీనికితోడు ఉపాధి రంగంలో ప్రభుత్వ, ప్రైవేట్ అవకాశాల చుట్టూ అబద్ధాల మేడ నిర్మిస్తున్నది. గత పదేండ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వం విభజన సమస్యలు, కరోనా, పెద్దనోట్ల రద్దు లాంటి జఠిలమైన ఇక్కట్లను ఎదుర్కొని లక్షా అరవై వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీచేసింది. ఉపాధి కల్పనను తెలంగాణ వాస్తవ అవసరాలతో ముడిపెట్టి పెద్ద ఎత్తున వ్యవసాయ విస్తరణ అధికారులు, అసిస్టెంట్ ఇంజినీర్లు తదితర ఉద్యోగాలనూ భర్తీ చేసి, సమతుల్య శీఘ్ర పురోభివృద్ధికి బాటలేసింది. ప్రైవేట్ రంగంలో సైతం టీఎస్‌ఐపాస్ వంటి వినూత్న విధానంతో ఉజ్వలమైన అవకాశాలకు ద్వారాలు తెరిచి, దాదాపు 19 వేలకు పైగా కొత్త పరిశ్రమల ఏర్పాటుకు మార్గం సుగమమై తద్వారా రూ.2 లక్షల 34 వేల కోట్లకు పైగా పెట్టుబడులు రాష్ట్రానికి తరలివచ్చాయి. దీనివల్ల ఒక్క ఐటీలోనే నూతనంగా 5.82 లక్షల కొత్త కొలువులు యువతరానికి దక్కాయి. పారిశ్రామిక, ఐటీ ఎగుమతుల్లో తెలంగాణ ముంబై, బెంగళూరులను కూడా వెనక్కినెట్టేసి పరుగు అందుకున్నది. జాబ్ గ్యారెంటీ గురూ, ఎంప్లాయ్‌మెంట్ అపర్చునిటీస్ స్టడీ సెంటర్ లాంటి అనేక సంస్థల అధ్యయనాలు రాష్ట్రం ఐటీ, పారిశ్రామిక రంగంలో సాధించిన ప్రగతిని కొనియాడాయి. కానీ, రేవంత్ సర్కార్ ఏలుబడిలో ఈనగాచి నక్కల పాల్జేసినట్టుగా మారిపోయింది.

ఏడాదిన్నర కాలంగా గత కేసీఆర్ ప్రభుత్వమే తొంబై శాతం భర్తీ ప్రక్రియ పూర్తిచేసిన కొలువుల నియామక ఆర్డర్‌లే పంచుకుంటూ ప్రగల్భాల ఎపిసోడ్‌ను సాగదీస్తున్నారు. పైగా ఇటీవల విడుదల చేసిన గ్రూప్-1 ఫలితాలు కొలువల భర్తీలో జరిగిన కుంభకోణంపై ఆధారాలను సైతం తేటతెల్లం చేస్తున్నాయి. ప్రైవేట్, రియల్ ఎస్టేట్, వ్యవసాయ, సేవల రంగాల గొలుసుకట్టును ఛిద్రం చేసి రాష్ట్ర ఆర్థికచక్రాన్ని ఛిన్నాభిన్నం చేయడం తోపాటు, సర్కార్ ఉద్యోగాలను సైతం హర్రాస్‌కు పెడుతూ నైపుణ్యాల నవతరాన్ని నిరుద్యోగ రుగ్మతకు బలిచేస్తున్నారు. ఓడ మల్లయ్యను ఒడ్డెక్కిన తర్వాత బోడ మల్లయ్య అని ఎగతాళి చేసినట్టుగా ఇప్పుడు రేవంత్ సర్కార్ విద్యార్థులను గుంట నక్కలని దూషిస్తూ అవమానిస్తున్నది. నిరుద్యోగుల పోరాటాల వెనుక కోచింగ్ సెంటర్‌లు, విపక్షాలున్నాయని విమర్శిస్తూ తిరగబడ్డ యువతరంపై కుట్రదారులనే నిందలేస్తున్నది. అడుగడుగునా ఇనుప వలలు పరిచినట్టు గుమిగూడటం అటుంచి కనీసం నోరు విప్పినా, సోషల్ మీడియాలో నిరసించినా కూడా నవతరాన్ని ఎఫ్‌ఐఆర్‌లోకి ఎక్కిస్తూ, పోలీస్‌స్టేషన్ల చుట్టూ, జైళ్లు, కోర్టుల చుట్టూ తిప్పులాడుతున్నది. యూత్ డిక్లరేషన్ హామీ మాట దేవుడెరుగు నోరు విప్పితేనే వీపులు పగలగొడుతున్నదీ సర్కార్. బేడీల తెలంగాణలో గోడకేసిన సున్నంలా మారిపోయింది నమ్మి ఓట్లేసిన నవతరం పరిస్థితి. అంతేకాదు, రాష్ట్ర యువతను దారుణంగా వంచిస్తూ, హింసిస్తూనే నాది యంగ్ ఇండియా బ్రాండ్ అని ప్రగల్భాలు పలుకుతూ నవ్విపోతే నాకేటి సిగ్గన్నట్టు రేవంత్ రెడ్డి సర్కార్ వ్యవహరిస్తున్నది. అందుకే, అవమానపడిన యువ తెలంగాణ మళ్లీ గులాబీ జెండా ఎత్తుకొని కదులుతున్నది. ఈ నేల నొప్పులు నయం చేయడం కోసం పోరు దారిలోనే ఉద్యమం నెల బాలుడు పదునెక్కి యవ్వన యోధుడిగా ఎదిగినట్టుగా ప్రభవిస్తున్న 25 ఏండ్ల బీఆర్‌ఎస్ పార్టీనే యువతరం భవితవ్యపు నావ అనే సత్యం తేటతెల్లమైపోయింది. దానివల్లనే నలువైపుల పల్లెల్లోని నవకులం ఏకమై ఓరుగల్లుకు బయలెల్లబోతున్నారు. ఇది పాలేవో.. నీళ్లేవో, విష నాగు ఏదో.. కామధేనువు ఏదో అర్థమైపోయిన సందర్భం. ఈ నెల 27న ఎల్కతుర్తి నుంచి మొదలు నలుదిక్కులా వరంగల్ ఎల్లలు మొత్తం యువ వెల్లువలో మునిగి తన్మయత్వం పొందనున్నాయి. లోహబాధ, దౌర్జన్యం/ అమాయకుల హింసిస్తే/ కసిరగిలే క్షణాలందు/ తూరుపు తెలవారునపుడు/ మదిన మెదిలె యువతరమా.. రమ్ము రమ్ము రారమ్ము అనే కవి పిలుపును వివిధ సంధార్భాల్లో తెలంగాణ యువత అందుకొని విభిన్న తొవ్వల్లో విలువలు పండించింది. అనేక గాయాలతో, అనుభవాలతో ఇప్పుడు యువ తెలంగాణ ఇంకా వివేకవంతంగా మారింది. అందుకే మళ్లీ ఏకతాటిపైకి వచ్చి ఎత్తిపడుతున్నది గులాబీ రగల్ జెండా.

**(వ్యాసకర్త: రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్)**




## ఒకే ఈడోళ్లం...



**విజయ్‌కుమార్ పిన్నింటి**
90520 39109

**గులాబీ జెండాతోనే నా ప్రయాణం సాగింది. ఎందుకంటే... ఆ జెండా, నేను ఒకే ఈడోళ్లం కాబట్టి. నాకు గులాబీ జెండాకు మూడు, నాలుగేండ్లు అటు ఇటైనా... గులాబీ జెండాతోనే సాగింది నా వయసు. అందుకే తెలంగాణపై మమకారం నా మనసులో లోతుగా పాతుకుపోయింది.**

సరిగ్గా యాదికి లేదు కానీ, 2003 అనుకుంటా మా ఊరు (సాగరం, జాఫర్గఢ్ మండలం) ఒక గొప్ప సంఘటనకు వేదికైంది. అదేమంటే పార్టీ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరైన గాదె ఇన్నయ్య (మా గ్రామవాసి) కేసీఆర్‌ను గాలి మోటార్‌లో మా గ్రామానికి తీసుకువచ్చి గులాబీ జెండాను ఎగురవేయించారు. ఆ సమయంలో మా ఊరికి సరిగ్గా బస్సే లేదు, కానీ, గాలి మోటార్ రావడమంటే మా ఊరోళ్ల ఆగం ఎట్లుంటదో ఊహించుకోండి. ఆ సమయంలో నా అసొంటి బడికిపోయే పోరగాళ్లం గాల్లో గిరా గిరా తిరిగి పోచమ్మ కాడ దిగిన గాలి మోటారును చూసి సంబురపడ్డం.

> **ఆ గాలిమోటార్లో ఎవలొచ్చిండ్రనే ముచ్చట మాకు తెల్వదు. కానీ, ఆ తర్వాత కేసీఆర్ వచ్చిండు అని పెద్దోళ్లు మాట్లాడుకోవడం చూసి మురిసిపోయాం. గాలి మోటార్ ముచ్చట పక్కకు పోయి, కేసీఆర్ అనే శక్తిని చూడటం కోసం తాపత్రయపడ్డాం. గులాబీ రంగు కండువా మెడలో వేసుకొని బక్కగా చకచకా అడుగులు వేస్తున్న కేసీఆర్‌ను అప్పుడే తొలిసారి ప్రత్యక్షంగా చూసిన. ఆనాడు ఆ రూపు మదిలో ముద్ర పడిపోయింది.**

అక్కడినుంచి తెలంగాణకు సంబంధించిన ఏ విషయమైనా అక్కడ కేసీఆర్ ఉంటడని తెలిసింది. చిన్నోన్నే అయినప్పటికీ నిశితంగా ఉద్యమాన్ని, కేసీఆర్ పోరాటాన్ని గమనిస్తున్నాను. పెద్ద పెద్ద ఉద్యమాలు చేయలేదు కానీ, ఏనాడు తెలంగాణ బంద్ ప్రకటించినా ఆ రోజు మా మిషన్ ఉన్నత పాఠశాల విద్యార్థులందరం రాష్ట్రం కోసం ర్యాలీగా ఊరంతా తిరిగి నినాదాలు చేసినం..

***

మొత్తానికి కేసీఆర్ పోరాటంతోనే రాష్ట్రం ఏర్పడటం, ఏర్పడిన రాష్ట్రం ఆయన నాయకత్వంలో బాగుపడటం చూసి గర్వపడుతున్నాను. ప్రపంచంలో జరిగిన ఎన్నో విప్లవాలు ఎందరినో కదిలించాయి. ఎంతో స్ఫూర్తిని నింపాయి. క్యూబా విప్లవం, ఫ్రెంచ్ విప్లవం, రష్యా విప్లవం, భారత స్వాతంత్ర్య ఉద్యమం, తెలంగాణలో సాయుధ రైతాంగ పోరాటం ఇలా ఎన్నో... కానీ, కేసీఆర్ నాయకత్వం వహించి పల్లె పల్లెను దండు కట్టి నడిపించిన ప్రత్యేక తెలంగాణ ఉద్యమం మాత్రం నాపై చెరగని ముద్ర వేసింది. ఈ తెలంగాణ గడ్డ మళ్లీ పరాయి పాలకుల పాలు కాకుండా ఉండాలంటే, స్వాభిమానంతో వెలగాలంటే మన ఇంటి పార్టీని ఆదరించాలి. గులాబీ జెండాను గుండెలకు హత్తుకోవాలి.

**(వ్యాసకర్త: బీఆర్‌ఎస్‌వీ నాయకులు, కేయూ)**

# గిరిజనుల అండ... గులాబీ జెండా

**తెలంగాణ ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనుల మరణాలను చూసి డబ్ల్యూహెచ్‌వో నాడు హెల్త్ ఎమర్జెన్సీ (విపత్తు ప్రాంతాలు)గా ప్రకటించింది. నక్సలైట్ల పేరుతో అమాయక గిరిజనులను ఎన్‌కౌంటర్లు చేయడం, దేశంలోనే ఆడ శిశువుల విక్రయానికి కేంద్రంగా మారిన దేవరకొండ లంబాడి గిరిజన తండాలు కరువు కాటకాలు, ఆకలి చావులతో అల్లాడిన పరిస్థితులు. బతుకుదెరువు కోసం మహా నగరాల్లో నడి రోడ్లపై అడవి బిడ్డలు అవస్థలు పడ్డారు. ఇవీ ఉమ్మడి ఏపీలో తెలంగాణ గిరిజనుల దుస్థితి.**



**శ్రీను నాయక్ దోన్‌వాన్**
85220 18001



తెలంగాణ గిరిజనుల దుస్థితిని చూసి ఆనాడు యునెస్కో, డబ్ల్యూహెచ్‌వో వంటి అంతర్జాతీయ సంస్థలు కూడా ఆందోళన చెందాయి. రోడ్డు సదుపాయాలు, వైద్య సదుపాయాలు లేక ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాలలో నివసిస్తున్న ఆదివాసీలు ఏటా కొన్ని వేల మంది విషజ్వరాల బారినపడి చనిపోయారు. ఏజెన్సీ ప్రాంతాల గిరిజనుల ఆర్తనాదాలను చూసి యావత్ ప్రపంచమే నివ్వెరపోయింది.

గిరిజన సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశంతో 1980 నుంచి 2013 వరకు తెలంగాణ వ్యాప్తంగా అనేక గిరిజన సంఘాలు పుట్టుకొచ్చాయి. ఉమ్మడి ఏపీ ప్రభుత్వాలపై పోరాటం చేశాయి. అయినా పాలకులు ఏనాడూ కనికరించలేదు. ఇంతటి దుర్భర జీవితాన్ని గడిపిన తెలంగాణ గిరిజన ప్రజలకు కేసీఆర్ వంటి మహా నాయకుడు గులాబీ జెండా పట్టుకొని ప్రకృతి వరప్రసాదంగా ముందుకువచ్చాడు. స్వరాష్ట్రంలో తమ అభివృద్ధికి బాటలు వేస్తాడని నాడు గిరిజన ప్రజలు కూడా ఊహించలేదు. సమస్యల వలయంలో చిక్కుకొని, దిక్కుతోచని స్థితిలో ఉన్న తెలంగాణ గిరిజనులకు గులాబీ జెండా ఆవిర్భావం కొండంత భరోసానిచ్చింది. తెలంగాణ సాధన సంకల్పంతో తన ఉద్యమ జీవితాన్ని మొదలుపెట్టిన నాటి నుంచే గిరిజనుల అభివృద్ధి తో సాధించబోయే తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ముడిపడి ఉన్నదని కేసీఆర్ భావించారు. 2002, ఏప్రిల్ నెలలో తెలంగాణ ప్రాంతంలోని ములుగు మండలం రామచంద్రపురం గ్రామపంచాయతీ పరిధిలోని 'భాగ్య తండా'లో పర్యటించి రాత్రి బస చేశారు. భానోత్ భీమా నాయక్ తన కూతురి పెళ్లి కోసం దాచుకున్న సొమ్ము కాలి బూడిదకావడంతో కేసీఆర్ చలించిపోయారు. దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్న బానోతు భీమా నాయక్‌కు ఆర్థిక సహాయం చేశారు. ఇటువంటి పరిస్థితి తెలంగాణలో ఏ బిడ్డకు రాకూడదనే సంకల్పంతో నాడే 'కల్యాణలక్ష్మి' పథకాన్ని రూపొందించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంతో ఆ పథకం అమలులోకి వచ్చింది. తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ 3,146 తండాలు, గూడేలను గ్రామ పంచాయతీలుగా మార్చారు. తెలంగాణ రాష్ట్రాభివృద్ధికి గిరిజనుల అభివృద్ధి పునాది అని భావించిన కేసీఆర్ 2022 అక్టోబర్ 1వ తేదీ నాడు జీవో నెంబర్ 33 ద్వారా తెలంగాణ గిరిజనులకు రిజర్వేషన్ 10 శాతానికి పెంచి ఇస్తున్నట్టు ఉత్తర్వులు జారీ చేశారు.

ఉమ్మడి ఏపీలో ఏండ్ల తరబడి పరిష్కారం కానీ పోడు భూముల సమస్యను కేసీఆర్ పరిష్కరించారు. అడవి ప్రాంతాల్లో నివసిస్తూ పోడు వ్యవసాయం చేసుకుంటున్న గిరిజనులను రైతులుగా గుర్తించి, ఆ భూములకు పట్టాలు పంపిణీ చేశారు. లక్షా యాభై వేల మంది గిరిజన రైతులకు 4 లక్షల పై చిలుకు ఎకరాల పోడు భూములకు పట్టాలను ఇచ్చి వారి జీవితాల్లో వెలుగు నింపారు. అంతేకాదు, రైతుబంధు పథకాన్ని కూడా వర్తింపజేశారు.

అంతేకాదు, కేసీఆర్ గిరిజనుల సంక్షేమం కోసం 'గిరి పోషణ' పథకాన్ని ప్రారంభించారు. మైదాన ప్రాంత గిరిజనుల అభివృద్ధికి 2016లో 'ట్రైకార్' కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశారు. ఏజెన్సీ గిరిజనులకు ఉద్యోగ కల్పనకై గిరిజన అటవీ ఉత్పత్తుల కొనుగోలుకై జీసీసీ కార్పొరేషన్‌ను ఏర్పాటు, గిరిజన విద్యార్థుల కోసం రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 92 గురుకుల పాఠశాలలు, 22 గిరిజన డిగ్రీ కళాశాలలు, దేశంలోనే తొలి గిరిజన లా కళాశాల ఏర్పాటు చేశారు. గిరిజన నిరుద్యోగులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడానికి సీఎంఎస్‌టీ పథకాన్ని ప్రవేశపెట్టారు. విదేశీ విద్యను అభ్యసించే గిరిజన విద్యార్థుల కోసం అంబేద్కర్ ఓవర్సీస్ పథకాన్ని ప్రారంభించారు. ఇలా గిరిజనుల కోసం కేసీఆర్ హయాంలో ఎన్నో సంక్షేమ పథకాలు పురుడుపోసుకున్నాయి. గులాబీ జెండా ఆవిర్భావం నుంచే తెలంగాణ గిరిజన సంక్షేమానికి బీజం పడింది. తెలంగాణ గిరిజనులకు గులాబీ జెండా శ్రీరామరక్షగా, కొండంత అండగా నిలిచింది. రజతోత్సవం పూర్తి చేసుకుంటున్న గులాబీ జెండాకు తెలంగాణ గిరిజన జాతి పక్షాన జేజేలు.

**(వ్యాసకర్త: బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి, ఓయూ)**



## బాహుబలి.. బాపు



**మంత్రి శ్రీదేవి**

**రజతోత్సవ సభ జరిగినచోటే విజయోత్సవ సభ జరుపుకుందాం. రాజీలేని వీరుడిని శాశ్వత విజేతగా నిలబెడదాం. ద్రోహులను పాతాళంలోకి అణగద్రొక్కుదాం. బాపును పరాజితుడిగా చరిత్రలో నిలబెట్టాలన్న ముప్పేట ముట్టడిని మట్టుబెట్టి నాలుగు కోట్ల గుండెల్లో విజయకేతనం ఎగరేసిన కారణజన్ముడిని కాపాడుకుందాం. తెలంగాణ పదాన్ని నిషేధించినవాడికి తెలంగాణలో స్థానం లేకుండా చేశాడు.**

రాజకీయ ప్రక్రియ - ఉద్యమం - రెంటినీ సమాంతరంగా నడిపించాడు. ఉద్యమాన్ని ఉక్కుపాదంతో అణచాలనుకున్న వలస పాలకులకు అవకాశం ఇవ్వకుండా సత్యాగ్రహం అనే మహాత్ముడి మార్గాన్ని ఎంచుకుని బాపు కేసీఆర్ తెలంగాణ మహాత్ముడయ్యాడు. అందుకే ఆయన తెలంగాణ బాపుగా జనం నోళ్లలో ఉన్నాడు. రక్తం బొట్టు చిందకుండా తెలంగాణను విముక్తి చేస్తానన్న తన బాసను నిలుపుకున్న బాపు కేసీఆర్ నిజంగా మనతెలంగాణ జాతికి బాపే !

తెలంగాణ గడ్డకు, తెలంగాణ బిడ్డలకు కాంగ్రెస్ చేసిన గాయాలు చెబితే ఒడిసిపోయేదికాదు. విలీనకాలం నుండి మొదలైన కాంగ్రెస్ రక్తదాహం తెలంగాణ రాష్ట్రం ఏర్పడేదాకా కొనసాగింది. వందలాది మంది చావుకు కారణమైంది. ఇవన్నీ గుణపాఠంగా తీసుకున్న బాపు కేసీఆర్ రాజ్యాంగబద్ధంగా ఉద్యమం నడిపించాడు. పోరాటాన్ని పల్లెల్లోకి పాకించి, పల్లెప్రజల్లో చైతన్యం తెచ్చాడు. సాంస్కృతిక కార్యక్రమాలతో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని పల్లెప్రజలకు అర్థమయే రీతిలో కళ్ళకు కట్టినట్టుగా వివరించాడు. బాపూ తనయ కవితక్క మన తెలంగాణ బతుకమ్మను ఒక పోరాట రూపంగా ఎంచుకుంది. ఇలా.. అన్ని రంగాల్లోకి తెలంగాణ ఉద్యమం చొచ్చుకు పోయింది. శత్రువు చేష్టలు డిగి చూస్తుండగా తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటం బాపు కేసీఆర్‌ను తిరుగులేని నాయకుడిగా నిలబెట్టింది.

బాపు కేసీఆర్ ఉప ఎన్నికలను ఒక ఆయుధంగా మలిచాడు. వలసవాద పార్టీలను మట్టికరిపించాడు. ప్రజలు గులాబీ జెండాను గుండెలకు హత్తుకున్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణకు ముఖ్యమంత్రి అయ్యాడు. జనరంజక పాలన అందించాడు. తమ దోపిడికి అడ్డుకట్ట వేసినందుకు వలస దోపిడిదారులు పగతో రగిలిపోయారు. ఆరునెలలకే ప్రభుత్వాన్ని కూలదోయ జూశారు. అపరచాణక్యుడైన బాపు కేసీఆర్ ముందు వాళ్ళ ఆటలు సాగలేదు.

2023 ఎన్నికల్లో దొంగలంతా ఏకమయ్యారు. డబ్బుల సంచుల వరద పారించారు. తమకున్న మీడియా ఆధిపత్యం ద్వారా బాపుపై దుష్ప్రచారం సాగించారు. అనేక కుట్రలు, కుతంత్రాలతో కేవలం ఒక శాతం ఓట్ల తేడాతో ఓడించారు. వాళ్ళ ఏజెంట్లను గద్దెనెక్కించారు. భవిష్యత్తులో జరగబోయే ఎన్నికల్లో మళ్ళీ బాపు కేసీఆర్‌ను గెలిపించడానికి ప్రజలు తహతహలాడుతున్నారు. బాపు కేసీఆర్ విజేతగానే చరిత్రలో మిగిలి పోవాలి. తెలంగాణ సమాజం ఉన్నంతవరకు బాపు కేసీఆర్ చరిత్ర ఉంటుంది. వరంగల్ రజతోత్సవంతో పార్టీకి పునర్వైభవం సాధించు విజయదుందుభి మోగిద్దాం.. జనజాతరను కళ్ళారా చూద్దాం పద..

**జై తెలంగాణ... జై బాపు కేసీఆర్...**

# జన సందోహమే.. భవిష్యత్తు సందేశం



**తెలంగాణ విజయ్**
94919 98702



తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్‌ఎస్) స్థాపించి 2025, ఏప్రిల్ 27తో 25వ వసంతంలోకి అడుగుపెడుతున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఉద్యమ సారథి, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో రజతోత్సవ సభ జరుగనున్నది. ఈ సభకు ఉద్యమ ఖిల్లా అయిన ఓరుగల్లు వేదిక కావడం ఆహ్వానించదగిన పరిణామం. సమైక్య రాష్ట్రంలో నాడు ఎక్కడ చూసినా దుఃఖమే.. తడారిన గొంతులు, బీడువారిన భూములు, ఎండిన పంటలను చూసి గుండె బరువెక్కిన తెలంగాణ ప్రాంత రైతులు ఉరికొయ్యలకు శవాలై వేలాడారు. పురుగుల మందు కలిపిన పెరుగన్నం తిని ప్రాణాలు బలి తీసుకున్నారు. ఇలాంటి దురాగతాలెన్నింటినో చూసి చలించిపోయి పురుడుపోసుకున్నదే టీఆర్‌ఎస్ (నేటి బీఆర్‌ఎస్) పార్టీ. ఈ పార్టీ పుట్టిందే తెలంగాణ ప్రజలను, తెలంగాన అస్తిత్వాన్ని కాపాడుకోవడం కోసం. టీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భవించిన నాడు గులాబీ జెండా ఎన్నో అవమానాలను ఎదుర్కొన్నది. పిడికెడు మందితో కదిలిన గులాబీ జెండా నేడు కోట్లాది మందికి నీడనిస్తున్నది. రాజకీయాల్లో గెలుపోటములు సహజం. అంతేకానీ, ఒక్కసారి ఓడిపోయినంత మాత్రాన బీఆర్‌ఎస్ పనయిపోయిందనుకోవడం, అలా ప్రచారం చేయడం జాతీయ పార్టీల అవివేకానికి, అజ్ఞానానికి పరాకాష్ఠ. కింద పడినప్పుడల్లా గోడకు కొట్టిన బంతిలా రెట్టింపయిన వేగంతో లేచి నిలబడింది గులాబీ జెండా. ఆ జెండా నీడన ఉన్నది తెలంగాణ కోసం రక్తాన్ని సైతం చిందించే లక్షలాది మంది సైనికులు. అలాంటి సైనికులున్న బీఆర్‌ఎస్ పార్టీ తన ప్రతాపం ఏమిటో ఈ నెల 27న ఓరుగల్లు వేదికగా చూపించబోతున్నది. ఆ జన సందోహం మధ్యన రానున్న రోజుల్లో గులాబీ జెండా మళ్లీ రెపరెపలాడనున్నదనే సందేశాన్ని చూసి రెండు జాతీయ పార్టీల నాయకులు బెంబేలెత్తడం ఖాయం.